నమస్తే తెలంగాణ

వికారాబాద్

15 హైదరాబాద్, శుక్రవారం 26 జనవరి 2024 VIKARABAD



# పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

ఆస్తి పన్ను వసూలుపై అధికారుల ప్రత్యేక దృష్టి

ఇప్పటివరకు జిల్లాలో 68.02 శాతం పన్ను వసూలు

రూ.5.14 కోట్లు రాక.. పెండింగ్‌లో మరో రూ.2.41 కోట్లు

వంద శాతం వసూలుకు అధికారుల చర్యలు

ఈ నెలాఖరులోగా 80 శాతానికి మించి వసూలు చేసేలా చర్యలు

జిల్లాలో గతేడాది 90 శాతం మేర వసూలు

వికారాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయడమే లక్ష్యంగా జిల్లా పంచాయతీ శాఖ అధికారులు ముందుకెళ్తున్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో కలిపి ఇప్పటివరకు రూ.5.14 కోట్ల(68.02 శాతం) ఆస్తి పన్ను వసూలుకాగా.. మరో రూ.2.41 కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉన్నది. స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రతి ఒక్కరి నుంచి ఆస్తి పన్నును రాబట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సంబంధిత అధికారులు సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ నెలాఖరులోగా నిర్దేశించిన లక్ష్యంలో 80 శాతం మేర వసూలు చేయాలని ఆదేశించారు. గత ఐదారేండ్లుగా టార్గెట్ మేరకు ఆస్తి పన్ను వసూలవుతున్నది. అయితే గతంలో మాదిరిగా కాకుండా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. మరోవైపు ప్రతి గ్రామ పంచాయతీకీ ప్రత్యేకంగా పంచాయతీ కార్యదర్శి ఉండేలా ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించడం కూడా ఆస్తి పన్ను వసూళ్లు పెరగడానికి కారణంగా చెప్పవచ్చు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు గడువు సమీపిస్తున్న దృష్ట్యా స్పెషల్ డ్రైవ్‌తో ఫిబ్రవరి నెలాఖరులోగా వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు.

### రూ.5.14 కోట్లు వసూలు...

జిల్లాలో ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌లు కలిపి మొత్తం రూ.5.14 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ 50 శాతానికిపైగా వసూలుకావడం గమనార్హం. పూడూరు, పరిగి, వికారాబాద్, ధారూరు మండలాల్లో ఇప్పటివరకు అత్యధికంగా ఆస్తి పన్ను వసూలైంది.

### వందశాతం వసూలుకు చర్యలు

జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాం.ఇప్పటివరకు దాదాపు 68 శాతం మేర పూర్తి కాగా, మరో రూ.2.41 కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉన్నది. అదేవిధంగా ఇప్పటికే స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. ఈ నెలాఖరులోగా 80 శాతం మేర ఆస్తి పన్ను వసూలు చేస్తాం

– డీపీవో తరుణ్‌కుమార్

### మండలాల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా..

| మండలం | ఇప్పటివరకు వసూలైన పన్ను |
|---|---|
| బంట్వారం | రూ.9.16 లక్షలు |
| బషీరాబాద్ | రూ.19 లక్షలు |
| బొంరాస్‌పేట | రూ.18.28 లక్షలు |
| ధారూరు | రూ.25.13 లక్షలు |
| దోమ | రూ.23.07 లక్షలు |
| దౌల్తాబాద్ | రూ.18.81 లక్షలు |
| కొడంగల్ | రూ.18.66 లక్షలు |
| కోట్‌పల్లి | రూ.13.89 లక్షలు |
| కులకచర్ల | రూ.25.20 లక్షలు |
| మర్పల్లి | రూ.26.10 లక్షలు |
| మోమిన్‌పేట | రూ.54.25 లక్షలు |
| నవాబుపేట | రూ.30.18 లక్షలు |
| పరిగి | రూ.43.22 లక్షలు |
| పెద్దేముల్ | రూ.27.13 లక్షలు |
| పూడూరు | రూ.46.82 లక్షలు |
| తాండూరు | రూ.58.86 లక్షలు |
| వికారాబాద్ | రూ.23.92 లక్షలు |
| యాలాల్ | రూ.31.61 లక్షలు |






# పల్లెల ప్రగతికి ఆర్థిక ప్రణాళికలు

రంగారెడ్డి జిల్లాకు రూ.115కోట్ల ఆర్థిక సంఘం నిధులు..

పనుల ప్రాధాన్యతను గుర్తిస్తున్న అధికారులు

ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న సభలు

ఎప్పటికప్పుడు ఈ- గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో వివరాల నమోదు

రంగారెడ్డి, జనవరి 25(నమస్తే తెలంగాణ): జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు రూపొందుతున్నాయి. 21 మండలాల పరిధిలోని 558 గ్రామపంచాయతీలకు దాదాపు రూ.115కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదల చేయనున్నది. ఈ మేరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రణాళికలను రూపొందించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైనది. గ్రామ పంచాయతీల్లో పనుల ప్రాధాన్యతను గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. త్వరలో మండల, జిల్లా స్థాయిల్లోనూ ఈ ప్రక్రియ చేపట్టి ఫిబ్రవరి 20 నాటికి ఈ–గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో పూర్తి వివరాలను నమోదు చేయనున్నారు.

### అక్రమాలకు చెక్ పెట్టేలా..

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా నిధులను విడుదల చేస్తుంటాయి. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన అందజేస్తుండగా.. చిన్న గ్రామపంచాయతీలకు సంవత్సరానికి కనీసం రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు వస్తున్నాయి. పెద్ద పంచాయతీలకు రూ.40లక్షల వరకు విడుదల అవుతున్నాయి. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రతి సంవత్సరం పంచాయతీలకు నిధులను అందిస్తున్నది. దీనికితోడు పంచాయతీలకు వివిధ పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతున్నది. అయితే ఈ నిధులను పాలకవర్గాలు ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నాయి. అవసరం లేని పనులకు నిధులను ఖర్చు చేస్తుండడంపై అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ తరహా అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు గ్రామ అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ప్రణాళికలో పేర్కొన్న పనులకే 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

### తొమ్మిది అంశాలతో ప్రణాళికలు..

తొమ్మిది అంశాలతో గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. మెరుగైన జీవనోపాధి, నీటి వసతి, పచ్చదనం, పరిశుభ్రత, స్వయంసమృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక భద్రత, మహిళల సాధికారత, పంచాయతీల్లో సుపరిపాలన వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇప్పటికే జీపీల్లో ముసాయిదా అభివృద్ధి ప్రణాళిక(డ్రాఫ్ట్ జీపీడీపీ) రూపకల్పనకు సంబంధించి గ్రామ సభలు జరుగుతున్నాయి. పంచాయతీ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ గ్రామ సభలో గుర్తించిన పనుల వివరాలను ఈ–గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు.

### మండల, జిల్లా స్థాయిల్లోనూ ..

మండల స్థాయిలో బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(బీపీడీపీ) నోడల్ అధికారిగా ఎంపీడీవోలు వ్యవహరిస్తారు. రూ.6,54,61,613 లతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికను అన్ని శాఖల భాగస్వామ్యంతో రూపొందించి ఫిబ్రవరి 7 నాటికి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి ఆమోదిస్తారు. 10వ తేదీలోపు పోర్టల్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తారు. అలాగే.. ఫిబ్రవరి 16లోపు జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(డీపీడీపీ)ను రూపొందించాల్సి ఉంటుంది. దీనికి నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో వ్యవహరిస్తారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3,27,30,807లతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలపై చర్చించి జడ్పీ సమావేశంలో ఆమోదం తెలుపుతారు. ఆ వివరాలను ఫిబ్రవరి 20లోపు పోర్టల్‌లో నమోదు చేస్తారు.

# ఉత్తమ డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్

అత్యుత్తమ పనితీరుకుగాను రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక

వికారాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ఉత్తమ పనితీరు కనబర్చినందుకు వికారాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.పల్వాన్‌కుమార్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు గురువారం వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా ఆయనకు అవార్డును అందజేశారు. సాధారణ ప్రసవాలు, బర్త్ ప్లానింగ్, యాంటినెటల్ కేర్ రిజిస్ట్రేషన్లు, టీబీ, అసంక్రమిత వ్యాధుల నివారణ తదితర అంశాల్లో జిల్లాను రాష్ట్రస్థాయిలో అగ్రగామిగా నిలుపడంలో ఆయన ఎంతో కృషి చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలిస్తూ ప్రోత్సహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఓటరుగా నమోదు చేసుకోవాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం


వికారాబాద్, జనవరి 25 : 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని ఎన్నేపల్లి చౌరస్తా నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో విద్యార్థులు, అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ యువత ఓటరుగా నమోదు చేసుకొని ఎన్నికల్లో భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లోని ప్రతి బూత్ స్థాయిలో అధికారులను నియమించి ఓటరు నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా బాధ్యతతో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతుందని దీన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాన్నారు. అనంతరం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) ఎన్. కోటిరెడ్డి మాట్లాడుతూ అతి పెద్ద ప్రజాస్వామ్యం, లిఖితపూర్వక రాజ్యాంగం కలిగిన గొప్ప దేశం మనదన్నారు. విధిగా ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అందరి సహకారంతో సమన్వయంతో నిష్పక్షపాతంగా పనిచేశామని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే ఒరవడితో ముందుకెళ్దామన్నారు. అనంతరం వయోవృద్ధులు, యువ ఓటర్లను కలెక్టర్, ఎస్పీ, అధికారులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, స్వీప్ నోడల్ అధికారి మల్లేశం, జిల్లా అధికారులు, వివిధ కళాశాల, పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వృద్ధ ఓటర్‌ను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు

# వ్యూస్ పెంచుకునేందుకు..అడ్డదారిలో రీల్స్

బంజారాహిల్స్, జనవరి 25: ఇన్‌స్టా రీల్స్‌లో వ్యూస్ పెంచుకునే క్రమంలో డీ మార్ట్ స్టోర్‌లో చాక్లెట్స్ చోరీ చేయడంతో పాటు ఫ్రీగా చాక్లెట్స్ తినడం ఎలా.. అంటూ వీడియోలు చేసిన యువకుడితో పాటు అతడికి సహకరించిన మరొకరిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. దేవరకొండ సమీపంలోని చందంపేట మండలం నేరేడుగొమ్ము గ్రామానికి చెందిన హనుమాన్ నాయక్(22) రాయదుర్గం సమీపంలో నివాసముంటూ.. ఓ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలో ఉంటున్న ఘట్‌కేసర్‌కు చెందిన సిద్ధూ (25) అనే యువకుడితో కలిసి కొంతకాలంగా ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ తయారు చేస్తున్నాడు. ఇటీవల ఇన్‌స్టా రీల్స్‌కు ఎక్కువ వ్యూస్ రావాలంటే ఏదైనా వెరైటీ వీడియో తయారు చేయాల్సిందేనని నిర్ణయించుకున్న వీరు.. షేక్‌పేట ప్రధాన రోడ్డుపై ఉన్న డీ మార్ట్ స్టోర్‌కు వెళ్లారు. కౌంటర్‌లో ఉన్న రెండు చాక్లెట్స్‌ను తీసుకున్న హనుమాన్ నాయక్ వాటిని తీసుకొని జేబులో పెట్టుకోవడం.. ఒక షర్ట్‌ను తీసుకుని ట్రయల్ రూమ్‌లోకి వెళ్లి చాక్లెట్స్ తినడంతో పాటు వీడియోలు తీసి.. ఇన్‌స్టా రీల్స్‌గా పోస్ట్ చేశారు. ఈ వీడియోలు వైరల్ కావడంతో డీ మార్ట్ యాజమాన్యం దృష్టికి వెళ్లాయి. ఇతర కస్టమర్లను ప్రభావితం చేయడంతో పాటు తమ సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తూ చాక్లెట్స్ చోరీ చేయడంతో పాటు రీల్స్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. గురువారం పోలీసులు నిందితులు హనుమాన్‌నాయక్, సిద్ధూలను అరెస్ట్ చేశారు.



# కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల స్కిట్‌కు ద్వితీయ బహుమతి

వికారాబాద్/కులకచర్ల, జనవరి 25 : చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు రాష్ట్ర స్థాయిలో బహుమతి లభించింది. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఓటుహక్కు విలువ అవగాహనపై తయారు చేసిన వీడియోకు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వీరికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో, ఎన్నికల అవగాహన అధికారి కోటాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న గవర్నర్ తమిళిసై

# పోలీసుల తీరు అమానుషం

-ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

రంగారెడ్డి, జనవరి 25(నమస్తే తెలంగాణ) : రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్శిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థినిపై పోలీసులు ప్రవర్తించిన తీరు అత్యంత అమానుష చర్య అని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. బైక్‌పై కూర్చుని జుట్టుపట్టి లాక్కెళుతూ విద్యార్థినిపై జులుం ప్రదర్శించిన కానిస్టేబుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు కర్కశంగా ప్రవర్తించారని తెలిపారు. రాష్ట్ర రాజధానికి అత్యంత సమీపంలోనే సంఘటన జరుగడం అత్యంత దురదృష్టకరమని వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



# ఉప్పల్..ఊగేలా..

భారత్-ఇంగ్లాండ్ మధ్య ఉప్పల్ స్టేడియంలో గురువారం నుంచి టెస్టు మ్యాచ్ జరుగుతున్నది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు క్రికెట్ అభిమానులు భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. క్రీడాకారుల ఆటను ఆస్వాదిస్తూ.. అభిమానులు కేరింతలు కొట్టారు. స్టేడియంలో పలువురు ప్రేక్షకులు ప్రదర్శించిన ప్లకార్డులు ఆకట్టుకున్నాయి.





